

# మాటా మంతీ

## - సాయి పద్మ



*11*

## కవులు, రచయితలూ ఏం చేస్తారు ?

కవులేం చేస్తారు ? అని వొక ప్రముఖ కవిత శివారెడ్డి గారిది ఉంటుంది . ఇప్పటి పరిస్థితుల్లో కవులూ, రచయితలూ ఏం చేస్తారు ? అంటే, వచ్చిన అవార్డులు తిరిగి ఇచ్చేస్తారు , నిరసన ప్రదర్శన లు చేస్తారు.. అని చెప్పుకోవాల్సి ఉంటుందేమో!! కల్బుర్గి హత్య, రచయితల మొహాన నల్ల రంగు పూయటం, దళిత రచయితలపై దాడులకు దిగటం , వంటి ఉదంతాల నేపధ్యంలో .. !

సాహిత్యం ఎంత మేరకు, ప్రభావితం చూపిస్తుంది ? అని అడిగితే, స్మార్ట్ ఫోన్ , గూగుల్ జెనరేషన్ క్లియర్ గా చెప్పలేరేమో గానీ.. ఏ జెనరేషన్ అయినా , చరిత్ర వెతుక్కొనే సందర్భం తప్పకుండా వస్తుంది. అప్పుడు మిగిలేది .. కొంత కవిత్వం , కొన్ని రచనలేగా , చరిత్రని పట్టుకోనేవి ? అలాంటి చారిత్రక సందర్భాన్ని, వేదనలనూ, సంవేదనలనూ , వ్యక్తిగత, సామాజిక వొత్తిళ్ళని వొడిసి పట్టి మనకి జాగ్రత్తగా అందించే కవి, రచయిత బాధ్యత గురించి ఎంత చెప్పినా తక్కువే.

అలాంటి కవుల్ని, రచయితల్ని మనమేం చేస్తాం ? మనలోని సునిశితమైన , తప్పులనీ, వొప్పుల్నీ బయటపెట్టినందుకు అసహ్యించుకుంటాం. విమర్శిస్తాం, వాళ్ళు రాసినదాన్ని కంటే, పర్సనల్ గా వాళ్ళని ఎలా ఇబ్బంది పెడదామా అని ఆలోచిస్తాం . మన ఇండియాలో మధ్యలో ..కాదు, కాదు.. పూర్తిగా కులం వొకటి .. మనుషుల్నీ, మేధల్నీ నిజంగా , నికరంగా నమిలేస్తూ.

నేను కొన్నాళ్ళు, హిలరీ క్లింటన్ గారి పొలిటికల్ కేంపైన్ కి, వాలంటీర్ గా పని చేసాను. అమెరికాలో, ఒక సౌత్ ఏషియా గ్రూప్ తో, ఒక మూడు నెలలు , పని చేసాను. ఆ మీటింగ్ లో.. వొక జోక్ చెప్పుకొనేవారు. వొక యూనివర్సిటీ కి వచ్చిన ప్రముఖుల్ని, అన్ని డిపార్ట్మెంట్లూ చూపెడుతూ.. పరిచయం చేస్తున్నారంట. అన్నీ చూసేసి, అదేంటి నాకు పొలిటికల్ డిపార్ట్మెంట్ చూపెట్టలేదు అంటే, ఆ గైడ్ సమాధానం – " పోలిటిక్స్ అన్నిచోట్లా, ఉన్నాయండీ.. వేరే డిపార్ట్మెంట్ ఎందుకు ?" అని నవ్వుతూ..! నవ్వుకోవటానికి సరదాగా ఉన్న విషయంలో ఎంత Avoidable మానవ విషాదం ఉందొ కదా ..?

శివారెడ్డి గారు రాస్తారు – కవులేం జేస్తారు

ప్రభుత్వాన్ని ధిక్కరిస్తారు

ప్రజలకు చేతులిస్తారు

తెల్లకాయితానికి అనంత శక్తినిస్తారు

నేనంటాను – ఇప్పటి పరిస్థితుల్లో , కవులేం చేస్తారు ..

ధిక్కార స్వరంపై దాడులతో అపస్వరాలవుతారు

నిజానికి పూసిన నల్లరంగుతో, నలుదెసలా పరికిస్తారు

సోలో నిరసన స్వరాలు, ప్రజా గళం గా మారని నిస్సహాయతకి నిట్టూరుస్తారు

నిజానికి , నిరసన కులం , మతం తో ఇంతగా ముడిపడి ఉందా? అని నాకు ఆశ్చర్యంగా ఉంటుంది ! కవి అయినా, రచయిత అయినా ముందు మనిషి. అలాంటి మనిషి మీద దాడి చేసేంత అసహనం ఎప్పుడు పెరిగింది మనలో ?

ఇకపోతే బీఫ్ తిన్నాడని , మనిషిని చంపటం .. కులం కారణంగా నగ్నంగా నిలబెట్టటం, అభం శుభం తెలీని చిన్నారులని దారుణంగా ఆహుతి చేయటం .. బాలలపై లైంగిక అత్యాచారాలు చేయటం .. ఎక్కడున్నాయి ఇలాంటి వాటికి మూలాలు?

పెంపకాల్లోనా .. క్లాసు పుస్తకాలు తప్ప, ప్రపంచాన్ని పరిచయం చేయని మన విద్యా వ్యవస్థ లోనా , నేను,నాది అని గిరి గీసుకొని బ్రతికే మన లైఫ్ స్టైల్ లో నా ?

మన ప్రపంచాన్ని, బుర్రల్ని, మనసుల్ని కాస్త అయినా విశాలం చేసేది.. సాహిత్యమే కదా .. అలాంటి సాహిత్యాన్ని చంపేసి , మనం ఏం మిగుల్చుకుంటాం..

గోడున్నందుకి ఇంటిని నిందించు

యిల్లుందకు మనిషిని నిందించు

మనుషులున్నందుకు దేశాన్ని నిందించు

మీక్కావలసింది

గోడలులేని యిల్లు, ఇళ్ళులేని మనుషులు

మనుషులు లేని దేశం .......(శివారెడ్డి ) ఇవేనా మనకి కావలసింది ?

మతం,కులం, ప్రాంతం, వర్గం, ఛాందస భావాలతో .... విడిపోయి, అసహనం పెచ్చు మీరిపోయి .. మనం సాధించేది అసంతృప్తి, దుఖం .. చరిత్రని రక్తంతో చెరిపేసే శోకం తప్ప వేరేది ఏముంది ?

సుసంపన్నమైన సాహిత్యాన్ని , అది అందించే శాంతిని మర్చిపోయే జాతి ... భవిత, మనుగడ ప్రశ్నార్థకమే !

ఆలోచించండి.. అవార్డు తిరిగి ఇవ్వటం నిరసన లో భాగం కావచ్చు.. కానీ.. ఏ అవార్డు లేని ఎంతో మంది సాహిత్యకారులు ... సాహిత్యాన్ని ఆస్వాదించి ఆలోచించే ఎంతోమంది మామూలు పాఠకులు ఈ వెల్లువ లో తమ వంతు పాత్ర వహించాల్సిన అవసరం ఉంది . వచ్చింది అని నాకనిపిస్తోంది..

మీరేమనుకుంటున్నారో చెప్పండి ...

మళ్ళీ కలుద్దాం .. వచ్చే నెల ..!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments